సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 31 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.28, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.13 ప్రకారం ధర పలికింది.



హోరాహోరీగా చెస్ పోటీలు

లేపాక్షి నవోదయ విద్యాలయలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బాల, బాలికల విభాగాల్లో విజేతలను ప్రకటించారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.7°/19.9°

జిల్లాలో బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రతి ఇంటా ఆనందాలు విరియాలి

- జిల్లా ప్రజలకు కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న దీపావళి శుభాకాంక్షలు



కలెక్టర్ చేతన్



రత్న, ఎస్పీ

పుట్టపర్తి టౌన్: చీకట్లపై వెలుగు సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకుంటున్న వెలుగుల పండుగ దీపావళి అందరి జీవితాల్లో కాంతులు నింపాలని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న ఆకాంక్షించారు. దీపావళి సందర్భంగా జిల్లా ప్రజలకు వారు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ సకల శుభాలు, సంపదలు సౌభాగ్యాలు, కలగాలని ప్రతి ఇంటా కోటి ఆనందాలతో దీపాలు వెలగాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

'ఉచిత గ్యాస్' పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీలో బుకింగ్ వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ఉచిత గ్యాస్ పథకం పక్కాగా అమలు చేయాలని, గ్యాస్ వినియోగదారులకు ఏజెన్సీలు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'దీపం-2' పథకం ద్వారా అర్హులైన పేదలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఈనెల 31 నుంచి గ్యాస్ పంపిణీ ప్రారంభిస్తున్నామన్నారు. లబ్ధిదారులకు రేషన్ కార్డు ఉండాలని, ఆధార్ కార్డుతో బ్యాంకు ఖాతా తప్పనిసరిగా అనుసంధానమై ఉండాలన్నారు. 'దీపం-2' కింద గ్యాస్ బుక్ చేసుకున్న లబ్ధిదారులు...గ్యాస్ డెలివరీ కాగానే పూర్తి మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండు రోజుల్లో ఆ మొత్తం గ్యాస్ వినియోగదారుడి ఖాతాలో జమ అవుతుందన్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కూడా బుక్ చేసిన 48 గంటల్లో వినియోగదారులకు సిలిండర్ సరఫరా చేయాలని, రోజువారీగా ఉచిత గ్యాస్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలన్నారు. ఈ పథకం అమలులో ఏవైనా సమస్యలు తలెత్తితే..1967 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఉచిత సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట పౌరసరఫరా శాఖ జిల్లా అధికారి వంశీకృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పారిశ్రామిక అనుమతులు వేగవంతం చేయాలి

- విశ్వకర్మయోజన అర్హుల జాబితాను సిద్ధం చేయండి
- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా సహకరించాలని, సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులు వీలైనంత త్వరగా ఇవ్వాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన పారిశ్రామిక వేత్తలకు రుణాలు మంజూరు చేయాలని, ఇదివరకే పరిశ్రమలకు కేటాయించిన ప్లాట్లలో పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు నిర్ణీత గడువులోపు అనుమతులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సింగిల్ డెస్క్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న 9 పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను ఆమోదించాలని తీర్మానించారు. గోరంట్ల సమీపంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో స్కిల్ సెంటర్‌ను ప్రారంభించేందుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

వెలుగు దివ్వెలు.. సంతోష కాంతులు



కదిరిలో కిటకిటలాడుతున్న పూలమార్కెట్





హిందూపురంలో బాణసంచా దుకాణాల వద్ద జనం సందడి

వెలుగుల పండుగ దీపావళి.. ప్రతి ఇంటా వెలుగులు నింపుతోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ దీపావళి సంబరాల్లో మునిగి తేలుతున్నారు. లోగిళ్లన్నీ ప్రమిదల వెలుగుల్లో కాంతులీనుతున్నాయి. పిల్లలంతా బాణాసంచా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఆఫర్ల వర్షం కురిపించడంతో వస్త్ర దుకాణాలన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. పండుగ ఈసారి రెండురోజులు (గురు, శుక్రవారాలు) కలిసి రావడంతో ఉద్యోగులంతా సొంతూళ్లకు చేరుకున్నారు. దీంతో పల్లెల్లో పండుగ కళ కనిపిస్తోంది.

– సాక్షి బృందం, పుట్టపర్తి

మానవత్వం కరువు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు రామలింగయ్య. పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లి గ్రామం. తనకున్న నాలుగన్నర ఎకరాల్లో వేరుశనగ పంట వేశాడు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట మొత్తం నాశనమైంది. పశువుల మేతకు కూడా గ్రాసం పనికి రాని పరిస్థితి. రంగు మారడంతో శనక్కాయలు కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఇంత నష్టం జరిగినా... ప్రభుత్వానికి కనిపించలేదు. కరువు మండలాల జాబితాలో పుట్టపర్తికి చోటు దక్కలేదు. దీంతో ప్రభుత్వ సాయం కోసం రామలింగయ్య పెట్టుకున్న ఆశలన్నీ అడియాసలయ్యాయి.

...జిల్లాలో చాలా మంది రైతుల పరిస్థితి ఇదే. మూడంటే మూడు మండలాలనే చంద్రబాబు సర్కార్ కరువు జాబితాలో చేర్చడంతో రైతన్నలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులపై పగబట్టిన చంద్రబాబు సర్కార్

- తొలుత అనావృష్టి... ఆపై అతివృష్టి
- జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు
- నీట మునిగిన పొలాలు.. తడిసిన బస్తాల్లోని ధాన్యం
- అయినా రైతులపై కరుణ చూపని కూటమి సర్కార్
- కరువు జాబితాలో మూడు మండలాలకే చోటు
- మరో ఏడు మండలాల్లో మాదిరి కరువుగా పేర్కొన్న వైనం
- సగటు వర్షపాతం అంచనాతో అన్నదాతకు తీరని అన్యాయం



పెనుకొండ మండలం శెట్టిపల్లి గ్రామంలో నీట మునిగిన వరి



పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలో నీట మునిగిన పంట



మడకశిర మండలం తురుకువాండ్లపల్లిలో వర్షానికి తడిసి మొలకెత్తిన వేరుశనగను చూపుతున్న రైతు

సాక్షి, పుట్టపర్తి

కీలకమైన ఖరీఫ్ సమయంలో ముఖం చాటేసిన వరుణుడు...తీరా పంటలు చేతికందే సమయంలో విరుచుకుపడ్డాడు. రైతుల ఆశలపై నీళ్లు చల్లాడు. అదనులో సరైన వర్షం లేక సగం పొలాలు బీళ్లుగా మారగా, ఉన్న కొద్దిపాటి నీటితో రెక్కలుముక్కలు చేసుకుని పండించిన పంట వర్షార్పణమైంది. మానవత్వంతో రైతును ఆదుకోవాల్సిన చంద్రబాబు సర్కార్ మరింత పగ బట్టింది. రైతుకు తీవ్ర అన్యాయం జరిగేలా కరువు మండలాల జాబితా రూపొందించింది. జిల్లాలో ఖరీఫ్ పంటలన్నీ తుడిచిపెట్టుకు పోగా రైతులకు రూ.కోట్లలో నష్టం జరిగింది. అయినా చంద్రబాబు ప్రభుత్వం మాత్రం మూడంటే మూడు మండలాలనే కరువు జాబితాలో చేర్చింది. మరో ఏడు మండలాల్లో మోస్తరు కరువు ఉన్నట్లు చూపి తీరని అన్యాయం చేసింది.

ప్రభుత్వం పేర్కొన్న కరువు మండలాలు	తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల
మోస్తరు కరువుగా పేర్కొన్న మండలాలు	కనగానపల్లి, ధర్మవరం, ఎన్‌పీ కుంట, పరిగి, రామగిరి, గాండ్లపెంట, బుక్కపట్నం

పడిపోయిన పంటలు.. అడుగంటిన జలాలు..

గతేడాది అరకొర వర్షాలతో చాలా బోరుబావులు ఎండిపోయాయి. అంతకుముందు కూడా అంతంత మాత్రంగానే వర్షాలు రావడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఫలితంగా అడపాదడపా వచ్చిన వాన నీళ్లు ఎక్కడివక్కడే భూమిలోకి ఇంకిపోయాయి. నదులు పారలేదు. నీళ్ల చుక్క కనిపించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో వరుణుడిని నమ్ముకుని చిన్నపాటి వర్షాలకు పంటలు సాగు చేశారు. అవన్నీ ఆ తర్వాత వచ్చిన భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. ఖరీఫ్ సీజన్ మొత్తం రైతులకు కన్నీరే మిగిల్చింది.

జిల్లాలో సాగుభూమి :
3,65,175 హెక్టార్లు

పంట సాగు చేసిన భూమి :
1,62,800 హెక్టార్లు

ఇటీవల వర్షాలకు దెబ్బతిన్నది :
1,332 హెక్టార్లలో
(అధికారుల అంచనా)

22 మండలాలకు మొండిచేయి..

రైతుకు ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అంటూ ఎన్నికల వేళ ప్రచారం హోరెత్తించిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే మరచిపోయారు. ఉచిత పంటల బీమాకు మంగళం పాడారు. ఈ రబీ నుంచి రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేలా నిబంధనలు మార్చేశారు. తాజాగా కరువు మండలాల జాబితాలోనూ జిల్లాలోని 22 మండలాల రైతులకు తీరని అన్యాయం చేశారు. వాస్తవానికి తుపాను దెబ్బకు మడకశిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ పంటలన్నీ నాశనమయ్యాయి. ఇక పుట్టపర్తి నియోజకవర్గంలో చాలా మండలాల్లో సకాలంలో వర్షం కురవక విత్తనమే పడలేదు. కదిరిలో నియోజకవర్గంలోని చాలా మండలాల్లో రైతులకు పెట్టుబడి అందే అవకాశం లేదు. హిందూపురం, పెనుకొండ ఇలా ఏ నియోజవర్గంలో చూసినా పంట నష్టం తీవ్రంగా ఉంది. కానీ ప్రభుత్వం కరువు జాబితాలో 22 మండలాలను విస్మరించడంతో ఆయా మండలాల రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమ ఉసురు ఊరికే పోదని అన్నదాతలు శాపనార్థాలు పెడుతున్నారు.

పంటలన్నీ నాశనమయ్యాయి



ఖరీఫ్ సీజన్‌లో మా మండలంలో అరకొరగా విత్తనం పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేరుశనగ, మొక్కజొన్న, టమాట, వరి పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతికి అందే దాఖలాలు లేవు. కరువు మండలాల జాబితాలో నల్లచెరువు లేకపోవడం బాధాకరం. మా మండలంలో ఏ ఒక్క రైతుకు కూడా పెట్టుబడి కూడా గిట్టని పరిస్థితి.

– సిద్దారెడ్డి, ఉప్పార్లపల్లి, నల్లచెరువు మండలం

నష్టం కనిపిస్తున్నా.. కరుణ లేదా?



మా మండలంలో ఏ గ్రామంలో చూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడా చెరువుల కింద వరి పంట వేసినా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కనగానపల్లి చెరువు తెగి కింద ఉన్న వరి పొలాలన్నీ నీట మునిగాయి. అయినా మండలాన్ని మోస్తరు కరువు ప్రాంతంగా ప్రకటించడం శోచనీయం.

– లక్ష్మీరెడ్డి, ముక్తాపురం, కనగానపల్లి మండలం

కూలి డబ్బులు కూడా రాలేదు



ఐదు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. వర్షాలు సరిగా లేక పంట అంతంత మాత్రంగానే వచ్చింది. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షానికి శెనక్కట్టె కూడా పనికి రాకుండా పోయింది. ఒక్కో రైతుకు సగటున రూ.లక్ష నష్టం వచ్చింది. కానీ కరువు జాబితాలో మడకశిరను చేర్చకపోవడం బాధాకరం.

– రవికుమార్, తురుకువాండ్లపల్లి, మడకశిర మండలం

'కరువు' జాబితాలో చేర్చాలి



జిల్లా వ్యాప్తంగా కరువు తాండవం చేస్తోంది. చాలా చోట్ల విత్తనం కూడా పడలేదు. అక్కడక్కడా అరకొరగా బోరుబావుల కింద వేసిన పంటలు కూడా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు భారీగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి జిల్లాలోని అన్ని మండలాలను 'కరువు' జాబితాలో చేర్చాలి.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

అమరవీరుల అడుగుజాడల్లో నడుద్దాం



పుట్టపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ రత్న, పోలీస్ సిబ్బంది

- పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల అడుగుజాడల్లో నడుస్తూ సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి పుట్టపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐలు ఇందిర, సునీత, సురేష్, నరేంద్రరెడ్డి, ఆర్‌ఐలు వలి, మహేష్, రవికుమార్, ఆర్‌ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, ప్రదీప్, వీరన్నతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే నేర నియంత్రణ

సమష్టి కృషితోనే నేరాల నియంత్రణ సాధ్యమని, ఆ దిశగా పోలీసులంతా పనిచేయాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో హిందూపురం సబ్ డివిజన్‌కు సంబంధించిన నెలవారీ నేర సమీక్షా నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు వివరాలు తెలుసుకున్నారు. కోర్టు కేసుల పురోగతిపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, హత్య, పోక్సో, రోడ్డు ప్రమాద కేసులపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తే జిల్లాలో క్రైమ్ రేటు తగ్గించవచ్చన్నారు. సాటుసారా విక్రయాలు, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో కాలనీలు సందరిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. మిస్సింగ్, చోరీ కేసులపై దృష్టి సారిస్తూ రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. చోరీల నివారణకు రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. నేర నియంత్రణే ప్రథమ లక్ష్యంగా పనిచేయాలన్నారు. అలాగే సరిహద్దు చెక్ పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైయిజర్ సాయినాథరెడ్డి, ఏఓ సుజాత, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐలు ఆంజనేయులు, శ్రీనివాసులు, గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రిలింగ క్షేత్ర దర్శనానికి ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్: కార్తీక మాసంలో త్రిలింగ దర్శనం పేరుతో తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరస్వామి, యాగంటి, మహానంది క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం మధుసూదన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం తన కార్యాలయంలో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకూ తాడిపత్రి బుగ్గరామలింగేశ్వరాలయం, బనగానిపల్లి వద్ద ఉన్న యాగంటి, నంద్యాల వద్ద ఉన్న మహానంది క్షేత్రాలకు ప్రతి సోమవారం జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఉదయం 5 గంటలకు బస్సులు బయలుదేరి, తిరిగి సాయంత్రం ఆయా డిపోలకు చేరుతాయన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు పెంచుతామన్నారు. ఓ గ్రామం నుంచి 40 మంది భక్తులు వెళ్లాలనుకుంటే ఆ గ్రామం నుంచే బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ సదుపాయంతో పాటు సమీప బస్ స్టేషన్, ఏటీబీ ఏజెంట్ల వద్ద కూడా రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న డీపీటీఓ మధుసూదన్, సిబ్బంది

కాసులు కురిపిస్తున్న కనకాంబరాలు

మార్కెట్‌లో కిలో పూలు రూ.1,500

బత్తలపల్లి: కనకాంబరాలు రైతులకు కాసులు కురిపిస్తున్నాయి. దీపావళి పండుగ నేపథ్యంలో పూలకు డిమాండ్ పెరిగింది. బుధవారం బత్తలపల్లి మార్కెట్‌లో ఉదయం కేజీ రూ.1,000 పలికిన కనకాంబరాలు..మధ్యాహ్నం తర్వాత రూ.1,500 చేరాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పూలన్నీ రాలిపోగా...మార్కెట్‌కు వచ్చే సరుకు తక్కువైంది. పండుగ నేపథ్యంలో డిమాండ్ పెరగడంతో ధర అమాంతం పెరిగింది. మామూలు రోజుల్లో కేజీ కనకాంబరాలు రూ.200 నుంచి రూ.300 మాత్రమే పలికేవి. కానీ బుధవారం ఐదురెట్లు ఎక్కువ పలకడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



'ముద్ద' నివారణకు 1.75 లక్షల వ్యాక్సిన్లు



ముద్ద వ్యాధి లక్షణాలతో కనిపిస్తున్న ఆవుదూడ

అనంతపురం అగ్రికల్చర్: పశువులకు వ్యాపించే ముద్ద చర్మవ్యాధి (లంపీస్కిన్ డిసీస్-ఎల్‌ఎస్‌డీ) నివారణకు అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టినట్లు స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (అనిమల్ డిసీజెస్ డయోగ్నస్టిక్ ల్యాబ్- ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర తెలిపారు. ఇప్పటికే మొదటి విడతగా వ్యాధి నివారణలో భాగంగా అనంతపురం జిల్లాలో 2.37 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో 2.89 లక్షల గోట్‌ఫాక్స్ వ్యాక్సిన్లు పశువులకు ఇచ్చామన్నారు. ప్రస్తుతానికి ముద్ద వ్యాప్తి అదుపులోనే ఉందన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఎదుర్కొనేందుకు తాజాగా బెంగళూరులో ఉన్న ఏహెచ్‌వీబీ ల్యాబ్ నుంచి 1.75 లక్షల వ్యాక్సిన్లు తెప్పించామన్నారు. అందులో అనంతపురం జిల్లాకు 90,500, శ్రీ సత్యసాయి జిల్లాకు 84,300 వ్యాక్సిన్లు కేటాయించినట్లు తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో ఉన్న పశుశాఖ సిబ్బందిని సంప్రదించాలని రైతులకు సూచించారు. వ్యాధిని నివారించడానికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రెండు జిల్లాల జేడీలు డాక్టర్ జీవీ వెంకటస్వామి, డాక్టర్ జి.శుభదాస్‌లు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

క్లుప్తంగా

రెండు జేసీబీలు, ఐదు టిప్పర్లు పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్లు

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు జేసీబీలు, ఐదు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. అందిన ముందస్తు సమాచారం మేరకు బుధవారం గరిశలపల్లి సమీపంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నదిలో నుంచి ఇసుక తోడేస్తున్న రెండు జేసీబీలు, ఇసుక తరలిస్తున్న ఐదు టిప్పర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానులపై కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

6 మట్టి ట్రాక్టర్ల పట్టివేత



రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

ధర్మవరం రూరల్: మండలంలోని రేగాటిపల్లి వద్ద ఉన్న ఎర్రగుట్ట నుంచి గరుసును అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను బుధవారం ధర్మవరం రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఇటీవల ఎర్రగుట్ట నుంచి కూటమి నాయకులు పెద్ద ఎత్తున మట్టిని అక్రమంగా పట్టణానికి తరలించి సొమ్ము చేసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే మట్టి తరలింపులో కూటమి నాయకుల మధ్య బేధాభిప్రాయాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో టీడీపీకి నాయకులకు చెందిన జేసీబీని జనసేన నాయకులు ధ్వంసం చేసిన విషయమూ విదితమే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రూరల్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆరు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. పోలీసులను చూడగానే కొన్ని టిప్పర్లను డ్రైవర్లు అక్కడ నుంచి శరవేగంగా పక్కకు తీసుకెళ్లారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

11 మందికి ఎస్‌ఐలుగా పదోన్నతి

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో 11 మందికి ఎస్‌ఐలుగా పదోన్నతి దక్కింది. ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐలుగా వీరికి ఉద్యోగోన్నతి కల్పించారు. దీనిపై జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు జాఫర్ (ఆర్‌ఎస్‌ఐ), సూర్యకుమార్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు, శివప్రసాద్, లక్ష్మీనారాయణ, ఆనంద్, తేజ్‌పాల్, సరోజ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

298 దరఖాస్తులు.. 223 అనుమతులు

- టపాసుల దుకాణాల నిర్వహణలో కూటమి నేతల చేతివాటం



సాక్షి, పుట్టపర్తి: దీపావళి పండుగ సందర్భంగా టపాసుల దుకాణాల నిర్వహణలో కూటమి నేతలు చేతివాటం ప్రదర్శించారు. లైసెన్సుల కోసం ఇతరులెవరూ దరఖాస్తు చేయకుండా ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అనుమతులు పొందిన వాటికి పది రెట్లు ఎక్కువగా దుకాణాలు ఏర్పాటు చేశారు. అడ్డుకోవాల్సిన అధికారులు కూడా చోద్యం చూస్తూ ఉండిపోయారు. జిల్లా వ్యాప్తంగా టపాసుల దుకాణాల లైసెన్సుల కోసం 298 దరఖాస్తులు రాగా.. ఇందులో అనుమతులు మంజూరైన 223 దుకాణాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే దాదాపు వెయ్యికి పైగా దుకాణాలు ఏర్పాటు చేయడమే కాక నిబంధనలు తుంగలో తొక్కి టపాసులు విక్రయాలు చేపట్టారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ నిబంధనలు బేఖాతరు చేయడం గమనార్హం.

లెక్కకు మించి నిర్వహణ..

కదిరి, హిందూపురం, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, ధర్మవరంతో పాటు ఆయా మండలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో టపాసుల దుకాణాలు వెలిశాయి. ప్రభుత్వం రూపొందించిన విధివిధానాలను నిర్వాహకులు తుంగలో తొక్కారు. చాలా చోట్ల అగ్నిమాపక నిబంధనలు కనిపించవు. నీళ్ల, ఇసుక నిల్వలు అందుబాటులో లేవు.

లెక్క చెప్పే వారూ లేరాయె..

టపాసుల దుకాణాలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి.. ఎంతమందికి అనుమతులు మంజూరు చేశారు.. తదితర వివరాలు అందజేసే వారు కరువయ్యారు. ఏదైనా సమాచారం కావాలంటే లిఖిత పూర్వకంగా అర్జీ ఇస్తే ఉన్నతాధికారుల అనుమతితో ఇస్తామని చెబుతున్నారు.

జోరుగా జీరో దందా..

టపాసుల విక్రయాల్లో జీరో దందా జోరుగా సాగుతోంది. తాము విక్రయిస్తున్న వాటికి ఎలాంటి బిల్లులను నిర్వాహకులు ఇవ్వడం లేదు. ఎంత రేటు అనే విషయం చెప్పడం లేదు. ఎవరికి నచ్చిన రీతిలో వారు విక్రయాలు సాగిస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెంచేశారు.

విద్యార్థినులతో అనుచిత ప్రవర్తన

సోమందేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ముగ్గురు విద్యార్థినులతో ఓ యువకుడు అనుచితంగా ప్రవర్తించాడు. బాధితుల నుంచి సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పాఠశాలలోకి ద్విచక్ర వాహనంపై ప్రవేశించిన యువకుడు ఈవ్ టీజింగ్‌కు పాల్పడడంతో బాలికలు భయభ్రాంతులకు లోనయ్యారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుంటుండగా గమనించిన యువకుడు అక్కడి నుంచి ఉడాయించాడు. జులాయిలు పాఠశాల ఆవరణలోకి వచ్చి బాలికలను వేధిస్తుంటే ఏమి చేస్తున్నారంటూ ఉపాధ్యాయులతో తల్లిదండ్రులు వాగ్వాదానికి దిగారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యార్థినులు

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు



బాలికల విభాగంలో రన్నరప్ ట్రోఫీని అందుకుంటున్న అనంతపురం విద్యార్థులు



బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన నెల్లూరు విద్యార్థులు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ వేదికగా నిర్వహించిన అండర్-14 రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు రెండో రోజు బుధవారం హోరాహోరీగా సాగాయి. 13 ఉమ్మడి జిల్లాలకు సంబంధించి 130 విద్యార్థులతో పాటు కోచ్‌లు పాల్గొన్నారు. విజేతలను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి మొరార్జీ యాదవ్ తెలిపారు. పోటీలను నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ఆర్గనైజర్ సురేష్, కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, నేషనల్ ఆర్బిటర్ ఉదయకుమార్, పరిశీలకులు ఉమేష్‌కృష్ణ, డిప్యూటీ ఆర్బిటర్ ఆదిరత్నకుమార్, కో-ఆర్బిటర్ శివకృష్ణ తదితరులు పర్యవేక్షించారు. బాలుర గ్రూపు విభాగంలో మొదటి స్థానాన్ని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దక్కించుకోగా, రెండో స్థానంలో కృష్ణా, మూడో స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా క్రీడాకారులు నిలిచారు. అలాగే బాలికల గ్రూపు విభాగంలో మొదటి స్థానాన్ని విశాఖ పట్నం కైవసం చేసుకుంది. రెండో స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో పశ్చిమగోదావరి జిల్లాలు నిలిచాయి. బాలికల వ్యక్తిగత విభాగంలో మొదటి స్థానాన్ని త్రిపురాంబిక (చిత్తూరు), రెండో స్థానాన్ని తేజ అనుషా (గుంటూరు), మూడో స్థానాన్ని బల్లిబాల (విశాఖ), నాల్గో స్థానాన్ని శ్రావశ్రీ (విశాఖ), ఐదో స్థానాన్ని లాస్యశ్రీ (వైఎస్సార్) దక్కించుకున్నారు. అలాగే బాలుర వ్యక్తిగత విభాగం మొదటి స్థానంలో కొల్లాభవన్ (కృష్ణా), రెండో స్థానంలో హరిసూర్యనారాయణ (గుంటూరు), మూడో స్థానంలో మిథిలేష్ (నెల్లూరు), నాల్గో స్థానంలో నితీష్ (అనంతపురం), ఐదో స్థానంలో సాత్విక్ (తూర్పు గోదావరి) నిలిచారు. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలు, పతకాలను నిర్వాహకులు అందజేశారు.

18 నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు



సమావేశానికి హాజరైన అధికారులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాలను నవంబర్ 18 నుంచి 24వ తేదీ వరకూ వేడుకగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదేశించారు. వేడుకల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో వారు సమీక్షించారు. వేడుకలకు తరలివచ్చే దేశవిదేశీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదన్నారు. నవంబర్ 15,16 తేదీల్లోగా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పట్టణంలోని అంతర్గత రహదారులు, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. నవంబర్ 18న వేణుగోపాలస్వామి రథోత్సవం,. 22న సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం, 23న జయంతి ఉత్సవం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాలకు ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో గట్టి భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ట్రస్ట్ ప్రతినిధులు కోటేశ్వర రావు, సీవీ వాసుదేవన్, చలం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగమణి హత్య కేసులో వీడిన మిస్టరీ

- ఇద్దరి అరెస్ట్
- నగలు, నగదు కోసమే హత్య

అనంతపురం: నగరంలో సంచలనం రేపిన గుజ్జల గంగమ్మ అలియాస్ నాగమణి హత్యకేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. అనంతపురంలోని ఎర్రనేల కొట్టాలలో నివాసముంటున్న నాగమణి (48) హత్య ఉదంతం ఈ నెల 20న ఉదయం వెలుగు చూసింది. ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సీఐ శాంతిలాల్ ఆధ్వర్యంలో పోలీసులు బృందాలుగా విడిపోయి లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో అనంతపురానికి చెందిన చుక్కలూరు జయప్రకాష్ , ఆకుమల్లెల హరినాథ్ బాబు అలియాస్ హరిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నేరం చేసినట్లుగా అంగీకరించారు.

జల్సాలకు అలవాటు పడి..

వ్యసనాలకు బానిసలైన హరి, జయప్రకాష్ తమ జల్సాలకు అవసరమైన డబ్బును సులువుగా సంపాదించుకునేందుకు నేరాలను ఎంచుకున్నారు. ఈ క్రమంలో తన పెద్దనాన్న బలిజ రామకృష్ణ ఇంటి రెండో అంతస్తులో ఒంటరిగా అద్దెకు ఉంటున్న నాగమణిపై జయప్రకాష్ దృష్టి పడింది. పథకం ప్రకారం ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటల సమయంలో జయప్రకాష్ వాళ్ల ఇంటిపై నుంచి ఇద్దరూ గోడెక్కి నాగమణి నివాసముంటున్న గది పక్కన దిగారు. అనంతరం నాగమణి ఇంటి తలుపు వద్ద హరి కాపలాగా ఉండగా, గదిలోకి జయప్రకాష్ చొరబడ్డాడు. గమనించిన నాగమణి గట్టిగా కేక వేయబోతుండగా జయప్రకాష్ ఆమెను మంచంపైకి పడేసి ఎడమ చేతిని నోటిపై అదిమి పెట్టి కుడి చేతితో గొంతు నులిమి హతమార్చాడు. అనంతరం హతురాలి మెడలోని బంగారు చైన్, చెవులకున్న కమ్మలు, వెండి పట్టీలు, రూ.4 వేల నగదు, సెల్‌ఫోన్ తీసుకుని, గది లోపల, చుట్టుపక్కల కారం పొడి చల్లి ఉడాయించారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేయడంతో భయపడిన నిందితులు నేరుగా ఎర్రనేల కొట్టాల 1వ సచివాలయం వీఆర్వో స్వర్ణలత సమక్షంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు పోలీసులకు లొంగిపోయారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితులను పోలీస్ కస్టడీకి తీసుకోనున్నట్లు సీఐ శాంతి లాల్ తెలిపారు. నాగమణిని హతమార్చిన అనంతరం సాక్ష్యాలను రూపుమాపేలా కారంపొడి చల్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ వీరు ఏమైనా నేరాలకు పాల్పడి ఉంటారని, వాటి గురించి ఆరా తీసేందుకు నిందితులను పోలీస్ కస్టడీకి కోరనున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

నల్లచెరువు: మండలంలో వేర్వేరుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చెరువువాండ్లపల్లికి చెందిన రాజారెడ్డి, లలితమ్మ దంపతులు బెంగళూరులోని కుమారుడి వద్ద ఉంటున్నారు. దీపావళి పండుగ సందర్భంగా బుధవారం బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై దంపతులిద్దరూ దేవిరెడ్డిపల్లిలోని కుమార్తె ఇంటికి బయల్దేరారు. గ్రామంలోని మోడల్ స్కూల్ సమీపాన స్పీడ్‌బ్రేకర్ వద్ద వేగంగా వెళ్లినపుడు వెనుక కూర్చున్న లలితమ్మ ఎగిరి కిందపడటంతో తీవ్రంగా గాయపడింది. 108 వాహనంలో ఆమెను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఆమెను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

బొలెరో వాహనం ఢీకొని మరొకరికి గాయాలు..

యర్రగుంటపల్లికి చెందిన లక్ష్మన్న వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై కుమారుడు కార్తీక్‌తో కలిసి బుధవారం నల్లచెరువు వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని తిరుగుపయనమయ్యారు. యర్రగుంటపల్లి సమీపంలోకి రాగానే బైక్‌ను తన కల్లు వైపు నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మన్న కుడికాలికి తీవ్ర గాయమైంది. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు గమనించి గాయపడిన లక్ష్మన్నను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అప్రెంటిషిప్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్/క్రైం: ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రెంటిషిప్ చేసేందుకు ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, ఆర్టీసీ జోనల్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నజీర్‌అహ్మద్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కర్నూలు, అనంతపురం, నంద్యాల, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు. నవంబర్ 5 నుంచి 19వ తేదీలోపు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. మెకానికల్ డీజిల్ పూర్తి చేసిన వారిలో 18 మంది, మోటార్ మెకానికల్ వెహికల్ కోర్సుకు సంబంధించి ఐదుగురు, ఎలక్ట్రీషియన్‌లో ఐదుగురు, వెల్డర్ విభాగంలో ఇద్దరికి, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పును ఖాళీలున్నాయి. పూర్తి వివరాలకు 88868 85173లో సంప్రదించవచ్చు.

ప్రమాదంలో యూపీ వాసి మృతి



నయీమ్ (ఫైల్)

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... యూపీలోని మీరట్ నగరంలోని జానీబజార్‌కు చెందిన నయీమ్ (24) రిహాన్ ఎంటర్‌ప్రైజెస్‌లో సూపర్‌వైజర్‌గా శిక్షణ పొందుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం సొంతంగా కారు నడుపుకుంటూ అనంతపురం వైపుగా బయలుదేరిన ఆయన బత్తలపల్లి మండలం గుమ్మల్లకుంట బస్టాఫ్ సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై అండర్ వైరింగ్ కంకర వేస్తున్న మిల్లర్ (లారీ)ను ఢీకొన్నాడు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. డ్రైవింగ్ సీటులో ఇరుక్కుపోయిన నయీమ్‌ను స్థానికులు ట్రాక్టర్ సాయంతో వెలికి తీసి, ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. సమాచారం అందుకున్న బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్... ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించి, నయీమ్ మృతదేహాన్ని ఆర్డీటీ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నీట మునిగి వ్యక్తి మృతి



మృతుడు వెంకటేష్

చెన్నేకొత్తపల్లి: చెరువులో ఈత కొడుతున్న వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం సమీపంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన వెంకటేష్ (45) బీగాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యాపార నిమిత్తం బుధవారం సీకేపల్లి మండలం ముష్టికోవెలలో పర్యటించాడు. మధ్యాహ్నం పీకల దాకా మద్యం సేవించి చెరువులో దిగి ఈత కొట్టసాగాడు. లోతైన ప్రాంతానికి వెళ్లి బయటకు రాలేక నీట మునిగాడు. స్థానికులు గుర్తించి వెలికి తీసేలోపు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అప్పుల బాధలో వ్యక్తి ఆత్మహత్య

నల్లచెరువు: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజేఖాన్‌పల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు సురేష్ (40) ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో ఏడాది క్రితం అధిక మొత్తంలో అప్పులు చేశాడు. వడ్డీలు భారీగా పెరిగిపోవడంతో వాటిని తీర్చే పరిస్థితి లేక మనస్తాపంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ మక్బూల్ బాషా తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువతి..

బెళుగుప్ప: ఉన్నత చదువులు అభ్యసించినా ఉద్యోగం రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... జీడిపల్లికి చెందిన కమ్మ రామాంజనేయులు, నాగమణి దంపతుల కుమార్తె నవ్య (22) అనంతపురంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో డిగ్రీ వరకూ చదువుకుంది. అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి సాఫ్ట్‌వేర్ కోర్సు పూర్తి చేసింది. ఈ క్రమంలో ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అయినా ఫలితం దక్కలేదు. దీంతో ఇంటికి చేరుకున్న ఆమె బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

బావిలో వివాహిత మృతదేహం

నల్లచెరువు: కె.పూలకుంట చెరువు కట్ట సమీపంలోని ఓ బావిలో అదే గ్రామానికి చెందిన శారదమ్మ (33) మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శారదమ్మ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎన్ని చోట్ల వెదికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం చెరువు కట్ట కింద ఉన్న బావిలో గుర్తు తెలియని మహిళ శవం తేలియాడుతుండటం గమనించిన గొర్రెల కాపరులు గ్రామస్తులకు సమాచారం అందించారు. గ్రామస్తులు వెళ్లి పరిశీలించగా శారదమ్మగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. విషయం తెలుకున్న తహసీల్దార్ రవికుమార్, ఎస్‌ఐ మక్బూల్ బాషా సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.